ఏసుక్రీస్తు మార్గాన్ని అనుసరించండి

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- క్రిస్మస్ సందర్భంగా పలు చర్చిలలో ప్రార్థనలు

తెనాలిఅర్బన్: ఏసుక్రీస్తు బోధించిన ప్రేమ, శాంతి, సహనం వంటి లక్షణాలు మానవాళికి ఎంతో అవసరమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని పట్టణంలోని అన్ని చర్చిలలో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. టౌన్ చర్చిలో జరిగిన ప్రార్థనలో ఎమ్మెల్యే శివకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవకుమారుడు ఏసుక్రీస్తు మానవుడిగా జన్మించిన రోజును ప్రపంచ వ్యాప్తంగా క్రిస్మస్ పండుగగా జరుపుకుంటారని చెప్పారు. ఏసుప్రభు జీవన విధానం అందరికీ ఆదర్శప్రాయమని చెప్పారు. ఆయన బోధనల ద్వారా ప్రజలను సన్మార్గంలో నడిపించేలా చేశాయని తెలిపారు. అందరూ ఆయన బోధనలను అనుసరిస్తూ ఆయన కృపకు పాత్రులు కావాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కూడా ఏసుక్రీస్తు మార్గంలో నడుస్తున్నారని చెప్పారు. ఏసు బోధించిన విధంగా పేదలను సంక్షేమ పథకాల ద్వారా ఆదుకుంటున్నారని వివరించారు. అనంతరం ఆయనకు దైవసేవకులు ప్రత్యేకంగా ప్రార్థించారు.కార్యక్రమంలో పాస్టర్లు రెవరెండ్ డి.ఏసురత్నం, రెవరెండ్ డి.సల్మాన్‌రాజు, రెవరెండ్ లెనిన్‌బాబు, రెవరెండ్ ప్రకాష్‌బాబు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

- 31వ వార్డు చెంచుపేటలోని బాప్టిస్ట్ చర్చిలో జరిగిన క్రిస్మస్ ఆరాధనలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, కౌన్సిలర్ గోగిరెడ్డి మానసరెడ్డిలు పాల్గొన్నారు. అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు ఎమ్మెల్యే తెలియజేశారు. అనంతరం కౌన్సిలర్ సహకారంతో ఏర్పాటు చేసిన వంట సామగ్రిని ఎమ్మెల్యే చర్చి నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు పాల్గొన్నారు.
- నందివెలుగులోని ఇమ్మానియేల్ ప్రార్థన మందిరంలో క్రిస్మస్ ప్రార్థనల్లో ఎమ్మెల్యే శివకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకరక్షకుడైన ఏసుక్రీస్తు పుట్టిన రోజును ప్రపంచమంతా పండుగల జరుపుకుంటున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నందివెలుగు సర్పంచ్ దూళిపాళ్ళ పవన్‌కుమార్, రెవరెండ్ భానప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు కఠారి హరీష్, గుంటూరు కృష్ణ, పెచ్చింగ్ సుభానీ, సంఘ పెద్దలు పాల్గొన్నారు.
- చెంచుపేటలోని ఆర్‌సీఎం చర్చిలో దివ్య బలి పూజను నిర్వహించారు. ఏసుప్రభు ప్రతిమకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు సందేశాన్ని రెవరెండ్ ఫాదర్ ఆంథోని విన్సెంట్, విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ స్లీవయ్య, రెవరెండ్ ఫాదర్ విజయ్‌కుమార్‌లు అందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.
- కొలవరంలోని గ్రేస్ టెంపుల్‌లో క్రిస్మస్ ఆరాధనను నిర్వహించారు. పాస్టర్ ఆర్.పాల్‌రాజు సందేశాన్ని అందించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పినపాటి రవికుమార్, ఎం.సల్మాన్, జి.గోపాలరావు, పి.అనూష కిరణ్, పి.జయశ్రీ, పేటేటి డేవిడ్ పాల్, తదితరులు పాల్గొన్నారు.
- పట్టణంలోని బాప్టిస్టు చర్చి, లూథరన్ చర్చి, సాల్వేషన్ ఆర్మీ చర్చి, హోసన్నా ప్రార్థన మందిరం వంటి వాటిల్లో క్రిస్మస్ ఆరాధనలు జరిగాయి. సంఘ కాపరులు వాక్యపరిచర్య చేశారు. మారీసుపేట రెండుగేట్ల మధ్యలోని ఫిలడెల్ఫియా చర్చిలో బ్రదర్ ఆనందన్న, పాస్టర్ చిలువూరి నతానియేల్, జేరుషాలేమ్ ప్రార్థన మందిరంలో పాస్టర్ సోపాటి విజయ్‌కుమార్, మల్లెపాడులోని బాప్టిస్ట్ చర్చిలో పినపాటి గంగారావులు వాక్యపరిచర్య చేశారు.


టౌన్‌చర్చిలో ఎమ్మెల్యే శివకుమార్ ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న దైవసేవకులు


కొలకలూరు ఫాదర్ సాగర్ థామస్


ఆశీర్వాదాలను అందిస్తున్న బిషప్ జాన్‌పాల్ పినపాటి

భక్తి శ్రద్ధలతో క్రిస్మస్ ప్రార్థనలు

తెనాలిరూరల్: క్రిస్మస్ పండుగను క్రైస్తవ సోదరులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. లోక రక్షకుడి జన్మదినాన్ని భక్తితో చాటారు. పట్టణ మారీసుపేట వెలువోలువారి వీధిలోని రాక్ గాస్పెల్ చర్చిలో సంఘకాపరి, తెనాలి యునైటెడ్‌పాస్టర్స్ అండ్‌గాస్పెల్‌వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బిషప్ పినపాటి జాన్‌పాల్ వాక్యోపదేశం చేశారు. క్రీస్తును ధరించుకొనుటే నిజ క్రిస్మస్ అని ప్రబోధించారు. ప్రత్యేక ఆరాధనలో ప్రార్థనాశీర్వాదాలను అందించారు. పినపాటి రాజశేఖర్, ఈవూరి శ్రీనివాసరావు, దానియేలు, కె. భాస్కరరావు, జయరాజ్, రాక్‌గాస్పెల్ చర్చి సంఘపెద్దలు, సంఘస్తులు పాల్గొన్నారు.


టౌన్‌చర్చి ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు


ఆర్‌సీఎం చర్చిలో బాలయేసు ప్రతిమకు ప్రార్థనలు చేస్తున్న ఫాదర్‌లు


ఐతానగర్‌లో ఉప్పుతో ఏర్పాటైన అంశం


క్రీస్తు పుట్టుక నాటికలోని ఓ సన్నివేశ నమోనా

ఐతానగర్‌లో క్రీస్తు పుట్టుక నమోనాలు ఏర్పాటు

తెనాలిఅర్బన్: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ఐతానగర్‌లోని పలు ప్రధాన కూడలిలలో క్రీస్తు పుట్టుక నమోనాలను సోమవారం ఏర్పాటు చేశారు. కొందరు యువత ఉప్పుతో క్రిస్మస్‌స్టార్‌ను ఏర్పాటు చేశారు. అలాగే క్రిస్మస్ ట్రీని ఏర్పాటు చేసి దానిని అందంగా అలంకరించారు. అలాగే క్రీస్తు పుట్టుక ఘట్టాన్ని ప్రతబంబించేలా నమోనాను తయారు చేశారు. ఇవన్ని చూడముచ్చటగా ఉన్నాయి.


అందంగా అలంకరించిన క్రిస్మస్ ట్రీ

గోల్డెన్ అవర్‌లో రక్షణకు ధర్మ టెలీహెల్త్‌ప్రాజెక్టు

- గుండెపోటు వచ్చిన గంటలోపే వైద్యం
- టెలీమెడిసిన్ సేవలతో రోగులకు సేవలు
- డీ3 శారద సర్వీస్ సొసైటీ మరో వినూత్న ఉచిత సేవ
- నేడు పెదరావూరులో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌చే ప్రారంభం

తెనాలి: గుండెపోటు సంభవించిన మొదటి గంట కీలకం. ఆ వ్యవధిలోనే తగిన వైద్యం అందిస్తే ప్రాణాపాయం లేకుండా చూడొచ్చు. గుండె కండరాలకు నష్టం జరగకుండా నివారించొచ్చు. సరైన అవగాహన లేమి, నేటి న్యూక్లియర్ కుటుంబాల్లో సాయపడే మనిషి లేక ఆసుపత్రికి తీసుకెళ్లటంలో జాప్యం జరుగుతోంది. గుండెపోటు మరణాల్లో 47 శాతం ఆసుపత్రికి తీసుకెళ్లేలోగానే సంభవిస్తున్నాయనే గణాంకాలున్నాయి. అందుచేతనే తొలి గంటను 'గోల్డెన్ అవర్'గా వ్యవహరిస్తున్నారు. తెనాలి పట్టణ మహిళల్లో క్యాన్సర్ నివారణలో కృషిచేస్తున్న డీ3 శారద సర్వీస్ సొసైటీ ఇప్పుడు గోల్డెన్ అవర్‌లో వైద్యసేవలకు ధర్మ టెలిహెల్త్ ప్రాజెక్టుతో సిద్ధమైంది. రూరల్ మండలం పెదరావూరులో సిద్ధం చేసిన భవనంలో మంగళవారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చేతులమీదుగా ప్రారంభించనున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక వైద్యాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎంఆర్‌ఐ స్కానింగ్, ఆంజియోగ్రామ్ పరీక్షలు, గుండెపోటు సంభవించినపుడు ఖరీదైన ఇంజక్షనుతో సహా అన్ని రకాల వైద్యసేవలు ప్రభుత్వ వైద్యశాలల్లో అందుబాటులో ఉన్నాయి. అయినా తగిన అవగాహన లేని ఎందరో ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. సమయాన్నీ, డబ్బునూ, ఒక్కోసారి ప్రాణాన్నీ కోల్పోతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకునే ధర్మ ప్రాజెక్టును తీసుకొచ్చినట్టు డీ3 శారద సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ శారద చెప్పారు. ఇందులో టెలీ మెడిసిన్ సేవలకు ప్రాముఖ్యతనిచ్చారు. గుండెపోటు/ బ్రెయిన్ స్ట్రోక్ సమాచారం రాగానే తొలి గంటలోనే ధర్మ అంబులెన్స్ రోగి ఇంటికి వెళ్లి, ఈసీజీ సహా అన్ని పరీక్షలు చేస్తుంది. సీపీఆర్ చేస్తారు. అవసరమైతే హృద్రోగ నిపుణుడు/ న్యూరాలజిస్టుకు కనెక్టు చేస్తారు. డాక్టర్ సలహా ప్రకారం వైద్యం సూచిస్తారు. దగ్గర్లోని ప్రభుత్వ ఆసుపత్రికి లేదా రోగులు కోరుకున్న ఆసుపత్రికి తరలిస్తారు. ఇతర వ్యాధుల్లో రోగులకు నిపుణులచే వైద్య సలహాలను ఇస్తారు. రోగులకు అవసర ప్రయాణం, వ్యయం తగ్గిస్తారు. స్థూలంగా ఇదీ ప్రాజెక్టు.


డాక్టర్ డి.శారద

శరీర లక్షణాల ఆధారంగా తలెత్తనున్న జబ్బులను గుర్తించి తగిన జాగ్రత్త/ చికిత్సతో ఆ ముప్పు నుంచి తప్పుకునే అవకాశం ఉంది. ఇందుకు భిన్నంగా నేటి సమాజం వ్యాధి బహిర్గతమైనపుడే చికిత్సకు వెళుతోంది. జీవనశైలి వ్యాధులు, సంక్రమించని వ్యాధుల్లో 60 శాతాన్ని ప్రాథమికంగా నివారించే వీలుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని సత్యసాయి సంస్థల్లో 25 ఏళ్లు వివిధ రకాల సేవలను అందించిన డాక్టర్ శారద, వలంటీర్లను సిద్ధం చేసుకుని ఉచిత వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నారు. గర్భాశయ కణితలు, గర్భసంచిలో పుండ్లు, థైరాయిడ్, మధుమేహం వంటి ఆరోగ్య సమస్యలకు చికిత్సలను చేస్తున్నారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మున్సిపాలిటీ సహకారంతో మహిళల్లో క్యాన్సర్ రహిత తెనాలి కోసం విశేషంగా కృషిచేశారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో క్యాన్సర్ ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటుచేసి 3,000 మందికి పైగా మహిళలకు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు చేశారు. 22 మందికి క్యాన్సర్ నిర్ధారించారు. 200 మందిలో రిస్క్ ఉందని సూచించారు. ఈ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశారు. మళ్లీ ఇప్పుడు ధర్మ ప్రాజెక్టుతో జనం ముందుకొస్తున్నారు.

కొన్నేళ్ల క్రితం తన తండ్రికి గుండెపోటు సంభవించినపుడు తొలి గంటలో తగిన వైద్యం అందుకోలేని నిస్సహాయ పరిస్థితి, దర్మ ప్రాజెక్టుకు ప్రేరణ అంటారు డాక్టర్ శారద. ఇందుకోసం కార్డియాలజీకి సంబంధించిన అధీకృత శిక్షణ తీసుకున్నారు. తమ వలంటీర్లు 21 మందికి సీపీఆర్, ఇతర గోల్డెన్ అవర్ వైద్యసేవలపై శిక్షణనిచ్చారు. పెదరావూరులోని మహిళా మండలి తమ భవనాన్ని ఈ ప్రాజెక్టుకు ఇచ్చారు. ప్రత్యేక వాహనం, వైద్యపరికరాలు సిద్ధమైనట్టు చెప్పారు. డాక్టర్ రమేష్ కార్డియాక్ హాస్పటల్, రీసెర్చ్ సెంటర్, విజయవాడ కార్డియాలజిస్టుల ఆన్‌లైన్ పర్యవేక్షణలో తెనాలి, పరిసరాల్లో స్వచ్ఛందంగా గోల్డెన్ అవర్ సేవలను అందిస్తూ, వీలైనంతమందిని రక్షించాలనేది తమ ఆశయంగా వివరించారు.



పెదరావూరులో సిద్ధమైన ప్రాజెక్టు కేంద్రం, అధునాతన అంబులెన్స్

మాజీ ప్రధానమంత్రి వాజ్‌పేయి జయంతి

తెనాలిటౌన్: దేశ మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని సోమవారం బీజేపీ నాయకులు జరిపారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో వాజ్‌పేయి చిత్రపటానికి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాటిబండ్ల రామకృష్ణ, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ విలువలతో కూడిన రాజకీయాలు నడిపారని పేర్కొన్నారు. భారత దేశానికి అణుపరీక్షలు జరిపి, దేశ అభివృద్ధికి బాటలు వేశారని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.వాసుదేవనాయుడు, అడపా సంపత్‌రాయుడు, అడుసుమల్లి సుధాకర్, కుశల్ రాజ్ జైన్, శిఖా రవీంద్ర, కన్నెగంటి ప్రశాంతి, ఎం.కనకదుర్గ, గాన కళావతి, సాంబయ్య, వీరయ్య, తదితరులు పాల్గొన్నారు. రూరల్ మండలం నందివెలుగులోని మిద్దె సెంటర్‌లో వాజ్‌పేయి జయంతిని జరిపారు. పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యులు తోటకూర కోటేశ్వరరావు, వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేశారు. మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో డి.వాసు, అప్పలమ్మలు పాల్గొన్నారు.


వాజ్‌పేయి చిత్రపటం వద్ద బీజేపీ నాయకులు నివాళి

కెటిల్ బెల్ పోటీల్లో గుంటూరు క్రీడాకారులకు గోల్డ్‌మెడల్స్

గుంటూరు మెడికల్: వరల్డ్ కెటిల్ బెల్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆసియా చాంపియన్‌షిప్ పోటీలు ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు ముంబైలో జరిగాయి. పోటీల్లో ఏపీకి చెందిన ముగ్గురు క్రీడాకారులు పాల్గొని రెండు బంగారు, రెండు రజిత, ఒక కాంస్య పతకం సాధించినట్లు ఏపీ గిరేవోయ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, గుంటూరు లలితా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ పి.వి.రాఘవశర్మ తెలిపారు. గుంటూరు కొత్తపేటలోని లలితా హాస్పిటల్‌లో సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పతకాలు సాధించిన క్రీడాకారుల్ని అభినందించారు. వన్ ఆర్మ్ లాంగ్ సైకిల్ 24 కేజీల కెటిల్‌బెల్ 30 నిమిషాలు ఆఫ్ మారథాన్‌లో మొహమ్మద్ అనాస్ గోల్డ్‌మెడల్ సాధించినట్లు డాక్టర్ రాఘవ శర్మ చెప్పారు. వన్ ఆర్మ్ లాంగ్ సైకిల్ 24 కిలోల కెటిల్‌బెల్ 10 నిమిషాల క్లాసిక్ పోటీలో బంగారు పతకం, వన్‌ఆర్మ్ లాంగ్ సైకిల్ 24 కిలోల కెటిల్‌బెల్ 30 నిమిషాల ఆఫ్ మారథాన్‌లో కాంస్య పతకాన్ని మొహమ్మద్ జావిద్ గెలుపొందినట్లు తెలిపారు. డాక్టర్ నీలిమ 2 ఆర్మ్ లాంగ్ సైకిల్, వన్ ఆర్మ్ లాంగ్ సైకిల్ కెటిల్‌బెల్ పోటీల్లో రజత పతకాలు సాధించినట్లు వెల్లడించారు. గుంటూరుకు చెందిన క్రీడాకారులు జాతీయ స్థాయిలో జరిగిన క్రీడల్లో బంగారు పతకాలు సాధించడం చాలా గర్వంగా ఉందని డాక్టర్ రాఘవశర్మ పేర్కొన్నారు.


క్రీడాకారులతో డాక్టర్ రాఘవ శర్మ

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: మహిళ ఆత్మహత్యపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వికలాంగుల కాలనీలో నివసించే షేక్ సైదాబి (42) కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతోంది. దీంతో మానసికంగా కుంగిపోయి సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పట్నంబజారు: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. బుచ్చయ్యతోటకు చెందిన క్షత్రియ నరేంద్ర సింగ్ (34) నిత్యం మద్యం తాగి తిరుగుతుంటాడు. ఈనెల 14న పూటుగా మద్యం తాగి ఇంటి వద్ద కింద పడడంతో తలకు తీవ్ర గాయమైంది. తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి తల్లి ఈశ్వరీ బాయి ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రి నాగార్జున పరామర్శ

భట్టిప్రోలు: వెల్లటూరుకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు డొక్కా రామారావు(68), పెదపులివర్రుకు చెందిన జంపని వెంకటేశ్వరరావు(70) అనారోగ్యంతో మృతి చెందడంతో సోమవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున, బౌడ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు కలసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సంతాపం తెలిపారు. వైస్ ఎంపీపీ కౌతరపు పిచ్చయ్యశాస్త్రి, వైఎస్సార్ సీపీ నాయకులు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రేపు ఆరుద్రోత్సవం

భట్టిప్రోలు: ఆరుద్రోత్సవం (శివ ముక్కోటి) పురస్కరించుకుని భట్టిప్రోలు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలోని గంగాపార్వతీ సమేత నగరేశ్వరరస్వామి ఉత్తర ద్వార దర్శనం బుధవారం జరుగుతుందని దేవస్థాన కమిటీ అధ్యక్షుడు తూనుగుంట్ల సాయిబాబా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భట్టిప్రోలులోని మల్లేశ్వరస్వామి, విఠలేశ్వరస్వామి, హేమ విఠలేశ్వరస్వామి, వెల్లటూరులో అగస్తేశ్వరస్వామి, పెదపులివర్రులో రాజ రాజ నరేంద్రస్వామి దేవాలయాలతో పాటు శివాలయాల్లో శివ ముక్కోటి పూజలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవస్థానాల కార్యనిర్వాహణాధికారి దీవి వెంకట అప్పలాచార్యులు, నిర్వాహకులు తెలిపారు.

రాజన్న ప్రసాదం పంపిణీ

కర్లపాలెం: స్థానిక వైఎస్సార్ కూరగాయల వైఎస్సార్ అభిమాని కొక్కిగడ్డ రామరాజు ఆహార్ దాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం వైఎస్సార్ ప్రసాదం పేరుతో అన్నదానం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు తాతపూడి మనోహర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రామరాజు మాట్లాడుతూ కూరగాయల మార్కెట్‌కు వచ్చే ప్రజలకు 19 వారాలుగా సాంబార్ రైస్, పెరుగన్నం పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

నిత్యావసరాలు అందజేత

వరహాపురం(వేమూరు): మండలంలోని వరహాపురం గ్రామానికి చెందిన యల్లమాటి మరియదాసు రోడ్డు ప్రమాదంలో గాయపడి మంచానికే పరిమితమయ్యాడు. అతని కుటుంబానికి గ్రేస్ ఫౌండేషన్ అధినేత కైతేపల్లి షాలేం రాజు ప్రతి నెలా నిత్యావసర వస్తువులు అందిస్తున్నారు. సోమ వారం కూడా సరుకులు అందజేసినట్లు పచ్చి గళ్ల అనిల్ తెలిపారు. పందిపాటి మహేష్, వెలిచర్ల సురేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి 'ఆడుదాం ఆంధ్రా' ఆటల పోటీలు

చుండూరు(వేమూరు): ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు చుండూరు మండల ఎంపీడీవో సుగుణమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ స్థాయిలో జనవరి 9, మండల స్థాయిలో జనవరి 10 నుంచి 23వ తేదీ, నియోజకవర్గ స్థాయిలో 24 నుంచి 30వ తేదీ వరకు, జిల్లా స్థాయిలో జనవరి 31 నుంచి ఫిబ్రవరి 5 వ తేదీ వరకు ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు మోహనరంగా విగ్రహావిష్కరణ

రేపల్లె రూరల్: పట్టణంలోని ఓల్డ్ టౌన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వంగవీటి మోహనరంగ విగ్రహ ఆవిష్కరణ మహోత్సవం మంగళవారం సాయంత్రం 3 గంటలకు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. కౌన్సిలర్‌లు, కో-ఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని తెలిపారు.

అగ్ని ప్రమాదంలో సామగ్రి దగ్ధం

కొల్లూరు : అగ్ని ప్రమాదంలో గృహంలోని దుస్తులు, సామగ్రి దగ్ధమైన ఘటన కొల్లూరులో ఆదివారం చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. స్థానిక లాక్ సెంటర్ కనక దుర్గమ్మ ఆలయం వెంబడి నివసిస్తున్న అత్తలూరి అర్జునరావు అరటికాయల వ్యాపారి. అతని రేకుల ఇంటికి ఏర్పాటు చేసిన విద్యుత్తు తీగల నుంచి ఒక్క సారిగా మంటలు మంటలు ఎగసిపడ్డాయి. దీంతో ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు మంటలను గమనించి బయటకు పరుగులు తీశారు. మంటల తాకిడికి ఇంటిలోని విద్యుత్తు ఉపకరణాలు, దుస్తులు దగ్ధమయ్యాయి. సుమారు రూ. 60 వేలు వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు.



క్లుప్తంగా

ఉద్యోగం పేరిట మోసం

తెనాలిరూరల్: ఉద్యోగం పేరిట సోషల్ మీడియాలో వచ్చిన యాడ్‌ను చూసి డబ్బులు చెల్లించి ఓ యువతి మోసపోయింది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణ ఐతానగర్‌లో నివసిస్తున్న మమత సోషల్ మీడియాలో కొద్ది రోజుల క్రితం సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామన్న యాడ్‌ను చూస అక్కడ ఉన్న నంబరుకు కాల్ చేసింది. వారు సూచించిన విధంగా రూ. 30 వేలు బ్యాంకు ఖాతాలో జమ చేసింది. అప్పటి నుంచి నంబరు పని చేయకపోవడం, ఎటువంటి సమాచారం లేకపోవడంతో సైబర్ విభాగాన్ని ఆశ్రయించింది. విభాగం నుండి వచ్చిన సమాచారం మేరకు కేసు నమదు చేసినట్టు టూ టౌన్ పోలీసులు సోమవారం తెలిపారు.

నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ



తెనాలిఅర్బన్: ఫిలడెల్ఫియా చర్చి ఆధ్వర్యంలో నూతనంగా రూపొందించిన 2024వ సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం మారీసుపేట రెండుగేట్ల మధ్యలోని చర్చి ఆవరణలో బ్రదర్ ఆనందన్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాలెండర్‌లో ఉన్న దేవుని వాఖ్యాలను ప్రతిరోజు చదువుకుని ఆశీర్వాదం పొందాలన్నారు. కార్యక్రమంలో పాస్టర్ చిలువూరి నతానియేల్, సంఘ పెద్దలు ప్రసాద్, డేవిడ్ సన్, పినపాటి స్టీవెన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షునికి సత్కారం



తెనాలిటౌన్: వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల అధ్యక్షునిగా నియమింపబడిన వేముల మహేష్‌ను పార్టీ నాయకులు సత్కరించారు. నందివెలుగులోని మహేష్ స్వగృహంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దూళిపాళ్ళ పవన్‌కుమార్, పార్టీ నాయకులు మహేష్‌ను శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. తమ నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే శివకుమార్, పార్టీ నాయకులు ధన్యవాదాలు మహేష్ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొంత నగేంద్రరెడ్డి, కానుగోలు సురేష్, దుర్గాప్రసాద్, తన్నీరు వెంకటేశ్వరరావు, కంచర్లపాలెం గ్రామ కన్వీనర్ పాదిలి శ్రీనివాసరావు, ఎర్రగుంట్ల బుల్లయ్య, కల్యాణం శివనాగేశ్వరావు, పేరం మణికంఠ, షేక్ షిలార్‌బాబులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు

తెనాలిరూరల్: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథణం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ మారీసుపేటకు చెందిన 72 ఏళ్ల సుభాని ఆదివారం రాత్రి ఫస్ట్‌షోకు సినిమాకు వెళ్లాడు. 10.30 గంటల సమయంలో తన స్కూటీపై ఇంటికి వెళుతుండగా గిరి రోడ్డులో ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టడంతో తలకు కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం అందించగా ప్రకాశం రోడ్డులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్టు త్రీ టౌన్ ఎస్‌ఐ వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు.

సాహితీ రుద్రమ్మ లక్ష్మీకాంతమ్మ



బాపట్ల అర్బన్: ఆంధ్ర కవయిత్రుల చరిత్ర గ్రంథస్తం చేసి, తెలుగు సాహిత్య చరిత్రలో డాక్టర్ ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ సుస్థిర స్థానం సంపాదించారని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పి.సి.సాయిబాబు అన్నారు. లక్ష్మీకాంతమ్మ జయంతి సందర్భంగా సోమవారం టౌన్ హాల్లోని ఆమె విగ్రహానికి నివాళులర్పించారు. సంస్కృతాంధ్ర భాషలలో ధీటైన లక్ష్మీకాంతమ్మ మొత్తం 18 పుస్తకాలు రచించారని చెప్పారు. ప్రచండ వక్తృత్వ ప్రావీణ్యానికి ఆమె సాహితీ రుద్రమ బిరుదును అందుకున్నారని తెలిపారు. కేరళ ప్రభుత్వం ప్రచురించిన ప్రపంచ సాహిత్య చరిత్రలో ఆమె రచనలకు స్థానం దక్కిందని వెల్లడించారు. స్వాతంత్రోద్యమం, ఆంధ్రోద్యమంలోనూ చురుకైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి కళా ప్రపూర్ణ పురస్కారాన్ని అందుకున్నారన్నారు. ఆమె రచనలపై పరిశోధనలు చేసి పలువురు పిహెచ్‌డీ పట్టాలు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరం సభ్యులు, న్యూస్ పేపర్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.